

ఎమ్మెల్యేకి రాఖీ కట్టిన కమిషనర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శ్రావణపౌర్ణమి రాఖీ పర్వదినం పురస్కరించుకొని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రాఖీ కట్టారు. బుధవారం ఎమ్మెల్యే గహంలో కమిషనర్ సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యేకు తిలకం దిద్ది రాఖీ కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను చిత్తూరు నగరంలో జరుపుకోవడం సంతోషంగా ఉందని కమిషనర్ చెప్పారు.

విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ..

'సిపిఎం సమరభేరి'



పుంగనూరులో సమరభేరి ప్రారంభించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: కేంద్రంలోని మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపుచేయడంలో ఘోరంగా విఫలమైందని వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఎం సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తెలిపారు. పుంగనూరులో సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, మధ్యతరగతి ప్రజానీకం ధరలకోరల్లో చిక్కుకుపోతున్నారని విమర్శించారు. మోడీ గద్దెనెక్కిన రోజు రూ.450లు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200లకు చేరిందన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తానని చెప్పిన మోడీ ఇంకా సమస్య భారీగా పెరిగేలా చేశారని అన్నారు.. కోట్లాది మంది డిగ్రీ, పీజీలు చదివిన రోజువారీ కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో 30 వేలకోట్లు తగ్గించారని, మతోన్మాద మోడీ ప్రభుత్వానికి ఆదాని, అంబానీ లాంటి కార్పొరేటు బడా పెట్టుబడిదారులు ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. ఇలాంటి మతోన్మాద బీజేపీని రాష్ట్రంలో ఉన్న జగన్ ప్రభుత్వం భుజాన్ని మోస్తూ గతంలో మేం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన హామీని పక్కన పెట్టి మోడీ భజనతో రాష్ట్ర ప్రజలపై ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని అన్నారు. ఇలాంటి సమస్యలపై సిపిఎం దేశవ్యాప్తంగా ప్రజల నుండి సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయం దగ్గర అర్జీలు నిరసన కార్యక్రమాలు, సెప్టెంబర్ 4న మండల రెవెన్యూ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నాలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజల కోసం జరుగుతున్న ఈ సమరభేరి కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురళి, రమణ, కష్ణ , నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రణ చేయడంలో, విద్యుత్ ఛార్జిలను పెంచి, నిరుద్యోగాన్ని పెంచి ప్రజల బ్రతుకులను అతలాకుతలం చేస్తున్న మోడీ, జగన్‌ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం అఖిల భారత కమిటీ నిర్ణయం మేరకు సీపీఎం సమరభేరి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో సీపీఎం జిల్లా నాయకులు చైతన్య, కాంజీవరం సురేంద్రన్ ప్రారంభించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటనుండి ప్రజలపై ధరల భారాలు వేస్తూ ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అదుపులో పెడతామని హామీఇచ్చిన మోడీ ప్రభుత్వం ఆచరణలో అన్ని వస్తువులపై పన్నులభారాలు వేస్తున్నారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఆదేశాలమేరకు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కూడా ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తున్నదని 2014 నుండి వినియోగదారుల వాడిన విద్యుత్‌ఛార్జీలకు ట్రూఅప్ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నదని ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు ఎండకట్టాలని సిపిఎం తలపెట్టిన పోరుబాట ఆందోళనలో పాల్గొనాలని కోరారు.

గంగవరం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల నెరవేర్చేవరకు పోరాటం కొనసాగుతూ ఉంటుందని నియోజకవర్గం సిపిఎం నాయకులు ఓబుల రాజు తెలిపారు. బుధవారం మండలంలోని కల్లుపల్లెల పంచాయతీలో పార్టీశాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపుచేయడంలో ఘోరంగా విఫలమైందని వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సిపిఎం సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శాఖాకార్యదర్శి వరలక్ష్మీ, ఉష, గాయత్రి, భాస్కర్‌రెడ్డి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో సీపీఎం పోరుబాట


చిత్తూరులో మాట్లాడుతున్న పి. చైతన్య


గంగవరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఓబులేరాజు

ఏనుగు బీభత్సం... భార్యభర్తలు మృతి

- దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు
- అడవిలోకి తరిమేందుకు అవస్థలు పడిన అధికారులు, గ్రామస్తులు


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, గుడిపాల: ఒంటరి ఏనుగు దాడిలో ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం గుడిపాల మండలం 190 రామాపురం సమీపంలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో మామిడి తోపులో పనులు చేసేందుకు వెళ్లిన ఆరుగురు వ్యవసాయ కూలీలకు రాసనపల్లి మామిడితోపులో ఏనుగు కనిపించింది. ఏనుగును చూసి భయభ్రాంతులకు గురైన కూలీలు అక్కడి నుండి పరుగులు పెట్టారు. ఆరుగురు కూలీల్లో కార్తిక్ అనే యువకుడిపై ఏనుగు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈవిషయాన్ని రాసనపల్లి గ్రామస్తులకు తెలపడంతో సంఘటనా స్థలానికి వెళ్లి తీవ్రగాయాలతో ఉన్న కార్తీక్‌ను చికిత్స కోసం వేలూరు సిఎంసి తరలించారు. అటవీశాఖ, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు అరుల్‌పురం సిఎంసి ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లోని గుట్టలవైపు ఏనుగును తరుముతూ వెళుతున్న వీరికి పంటపొలాల్లో రామాపురం దళితవాడకు చెందిన భార్యభర్తలు సెల్వి(48) వెంకటేష్‌లు(52) మృతదేహాలు కనిపించాయి. ఇంతో సమీపంలోని ఏనుగు ఘీంకారాలు వినిపించాయి. గ్రామస్తులు ఏనుగును తరిమేందుకు ఎంత ప్రయత్నించినా దాదాపు రెండు గంటలకు పైగా అక్కడికి ఏనుగు వెళ్లలేదు. ఫారెస్టు అధికారి చైతన్య కుమార్‌రెడ్డి, సిబ్బంది సంఘటనా స్థాలానికి చేరుకొని సెల్వి, వెంకటేష్‌లను పొలాల నుండీ గ్రామస్తుల సాయంతో బయటకు తీసుకొచ్చారు. అప్పటికే వారు మృతి చెంది ఉండటంతో మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అటవీశాఖ నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ మృతదేహాలతో చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, అటవీశాఖ అధికారులు, ఎంపిపి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.


ఏనుగు దాడిలో మృతి చెందిన దంపతులు సెల్వి, వెంకటేష్

మృతుల కుటుంబాలకు రూ. లక్షలు ఎక్స్‌గ్రేషియో

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో అందించనున్నట్లు అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియోతో పాటు కుటుంబంలో ఒకరి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌ఛైర్మెన్ విజయానందరెడ్డి తన సొంత నిధుల నుండీ మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉదయం నుండీ చీలాపల్లి, రాసనపల్లి, ఇతర ప్రాంతాల్లో తిరుగుతున్న ఒంటరి ఏనుగును గుంపులో కలిపేందుకు అటవీశాఖ అధికారులు శ్రమిస్తున్నారు. బుధవారం రాత్రి వరకు ఒంటరి ఏనుగు గుడిపాల మండలం అటవీ ప్రాతాంలోనే తిరిగింది. దీంతో గుడిపాల పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ గ్రామం వైపు ఏనుగు రాకుండా కాపలా కాస్తున్నారు.


ఏనుగు దాడిలో త్రీవంగా గాయపడ్డ కార్తీక్


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎంఎల్‌ఏ శ్రీనివాసులు

ఏనుగులను నివారించడంలో అటవీశాఖ అధికారుల వైఫల్యం

మృతుల కుటుంబానికి రూ.25లక్షలు ఇవ్వాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరుఅర్బన్: గుడిపాల మండలం 190 రామాపురంలో ఒంటరి ఏనుగు దంపతులను తొక్కి చంపేయడంతోపాటు ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరచడం అత్యంత బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అన్నారు. మృతుల కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నిత్యం పలమనేరు, బంగారుపాళ్యం, గుడిపాల ప్రాంతాల్లో ఏనుగులు దాడి చేస్తున్నప్పటికీ వాటిని నివారించడంలో అటవీశాఖ అధికారులు వైఫల్యం చెందారు. రైతులు పండించిన పంటలను ధ్వంసం చేస్తున్న పట్టించుకొనే నాధుడే లేదన్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి ఏనుగుల దాడి నుండి రైతులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వంద శాతం పనులు పూర్తిచేయాలి : జెసి


గృహ నిర్మాణశాఖ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గృహనిర్మాణాలలో ఎంపిడిఓల పాత్ర కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక డిఆర్డీఏ సమావేశంలో గృహనిర్మాణ సంస్థ ఓఎస్‌డిలు రామచంద్రారెడ్డి, కిషోర్‌కుమార్, పిడిలు గృహనిర్మాణం, డ్వామా, పద్మనాభం, గంగభవని, గామీణ నీటి సరఫరాశాఖ ఎస్‌ఈ శంకర బాబులతో కలసి జిల్లాలో గృహనిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గృహనిర్మాణాలలో ఎంపీడీవోల పాత్ర కీలకమని, ఎంపిడిఓలు, గృహనిర్మాణసంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో 42 వేలు గృహాల నిర్మాణాలు పూర్తిచేసి రాష్ట్రంలోనే చిత్తూరుజిల్లా మొదటి స్థానంలో ఉందని, అదే స్ఫూర్తితో సెప్టెంబర్ 10 కల్లా సోక్ ఫిట్స్,ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, వెల్కమ్ అర్చిలు పూర్తిచేసి జిల్లాను మొదటిస్థానంలో ఉండేలా ఒక ప్రణాళిక ప్రకారంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గృహనిర్మాణాలలో లైన్ డిపార్ట్మెంట్‌లకు ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్, జేసి దృష్టికి తీసుకురావాలన్నారు. గృహనిర్మించుకొనే లబ్ధిదారులకు ఇసుక ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గహప్రవేశాలు జరిగేనాటికి జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, విద్యుత్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పీఎంఏవై గ్రామఅవార్డులు జిల్లాలో ఎక్కువ గ్రామాలకు వచ్చేలా ఎంపీడీవోలు కషిచేయాలన్నారు. సమావేశంలో గహనిర్మాణ సంస్థ ఈఈలు, డీఈలు, ఏఈలు, ఎంపీడీఓలు, విద్యుత్ శాఖ ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జంతువుల హక్కులు, చట్టాలపై అవగాహన

సివిల్ జడ్జి కరుణ కుమార్



అధికారులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరు: జంతువులకు ఉన్నటువంటి హక్కులు, చట్టాలకు సంబంధించి పశుసంవర్ధక శాఖ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు ప్రభాకర్‌తో కలిసి పశుసంబద్ధకశాఖ అధికారులకు చట్టాలపై సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మనుషలకు ఉన్నటే జంతువులకు హక్కులు చట్టాలకు ఉన్నాయని, ముగజీవాలు వాటి కష్టాలు చెప్పలేవని వాటికి సంబంధించి పశు సంవర్ధకశాఖ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జంతువులను అక్రమంగా తరలిస్తున్న సమయంలో జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తలు పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలిపారు. అనుకోని పరిస్థితులు జంతువులు ప్రమాదాల వల్ల మరణించిన వాటికి సంబంధించి కోర్టుకు అందజేసే పిఎం రిపోర్టులు ఎలా తయారు చేయాలన్న వాటిపై న్యాయసలహాలు సూచనలు తెలియజేశారు.


అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి- కార్వేటినగరం: పేదల అభివద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైస్‌శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం అమ్మపల్లి, కేపీ అగ్రహారం పంచాయతీలోని అమ్మపల్లి, ఏఎంఆర్ కండ్రిగ, కష్ణాపురం, పొన్నగల్లు, రాచపాళ్యం, కేపీ అగ్రహారం బీసీ కాలనీం, జాండ్లపేట, జాండ్లపేట ఎస్టీకాలనీ, సూరయ్యాపాళ్యం ఎస్సీ కాలనీలలో సర్పంచ్లు భారతి, శేఖర్రెడ్డి, ఎంపీటీసీ రాధికారెడ్డి, ఎంపీపీ లతబాలాజీతో కలిసి పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం ఇంటింటి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేదల ఆర్థికాభివద్ధే లక్ష్యంగా సంక్షేమాలు అందిస్తోందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ లక్ష నుంచి 6 లక్షల వరకు లబ్ధి చేరుకూరున్నాయని తెలిపారు. పేదల పాలిట కల్పవక్షంగా నిలుస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఏపీ సీఎస్ సంఘం అధ్యక్షులు కుమార్‌రెడ్డి కష్ణాపురం జలాశయంలో చేపపిల్లలు కావాలని మంత్రి దష్టికి తీసుకు రావడంతో స్పందించిన మంత్రి పిషరీస్ అధికారులతో మాట్లాడి స్పెషల్ స్కీం కింద మూడువేల చేపల పిల్లలను ఇవ్వాలను ఆదేశించారు. అలాగే పొన్నగల్లు, కష్ణాపురం దళితవాడ, కేపీ అగ్రహారం బీసీ కాలనీ, జాండ్ల పేట దళితవాడల్లో విద్యుత్‌లైన్లు ఇళ్లపై వెళుతున్నాయని తొలగించాలని మహిళలు మంత్రి దష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. సూరయ్యపాళ్యం ఎస్టీకాలనీలో ఇంటి పట్టాలు మంజురు చేయాలని కోరడం వెంటనే ఇంటి పట్టాలు అందించాలని హౌసింగ్ ఏఈ యోగేంద్ర నాయుడును ఆదేశించారు. జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, ప్రభాకర్రెడ్డి, ధనంజయవర్మ, పురంధర్, ఎంపీటీసీ దేశమ్మ, సర్పంచ్ పవన్, పాల్గొన్నారు.


గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటి సిఎం

అవయవదానం ప్రాణం పోస్తుంది : ఆర్కేరోజా



ప్రజాశక్తి- నగరి

అన్నదానం ఆకలి తీరస్తుందని, అక్షర దానం అజ్ఞానాన్ని తొలగిస్తుందని, భూదానం ఉపాధి కల్పిస్తుందని, అవయవ దానం ప్రాణం పోస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజనసర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం ఆమె తమిళనాడు వేలూరు నారాయణి హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవయవదాన దినోత్సవంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, పెద్దలు ప్రతిఒక్కరూ ఈ అవయవదానం ఆవశ్యకతను నిండుమనస్సుతో ఆలోచించాలన్నారు. చనిపోయినా చెయ్యగలిగేదానం అవయదానం అన్నారు. నారాయణి హాస్పిటల్ శ్రీ శక్తి అమ్మ ఆశీస్సులతో నడుస్తోందని ఎంతో మందికి వైద్యసేవలు ప్రతిరోజు అందిస్తోందన్నారు. అక్కడితో బాధ్యత తీరిపోయిందని భావించక అవయవదానంపై అవగాహన పెంచాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాని అన్నారు. కరోనా ప్రభావం వలన అవయవదానం చేసేవాళ్ల సంఖ్య మరింత తగ్గిపోయిందని అనుమానాలు, అపోహలు విడిచి అవయవదానం చెయ్యాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

136 గ్రామాల్లో మూడో విడత రీసర్వే

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరు: జిల్లాలో మూడో విడత రీసర్వే కార్యక్రమంలో 136 గ్రామాల్లో నిర్వహించడం జరుగుతున్నదని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ సిసిఎల్ఏ ముఖ్య కార్యదర్శి సిద్ధార్థ జైన్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకి సంబంధించి 130 గ్రామాలలో అన్ని పనులు పూర్తి అయ్యాయని, రెండవ విడత రీసర్వేకి సంబంధించి 90 గ్రామాలలో పూర్తి అయ్యిందని, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మూడో విడత రీసర్వే కార్యక్రమం జిల్లాలో 136 గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కార్యదర్శి పారదర్శకంగా ఈకార్యక్రమం నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బంది తప్పిదాలకు పాల్పడకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామాల్లో సర్వేరాళ్లు నాటడం కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ గౌస్ బాషా, సర్వే ఇన్స్పెక్టర్ గణేష్ లు పాల్గొన్నారు.

పోలీసులు అత్యంత సమన్వయం పాటించారు

నేరసమీక్షలో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పుంగనూరులో పోలీసులపై జరిగిన దాడిలో పోలీసులు పాటించిన అత్యంత సమన్వయం అభినందనీయమని, పాత నేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని సైబర్ క్రైమ్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా ప్రజలను అవగాహన పెంచి పెండింగ్‌లో ఉన్న వాహనాలను త్వరగా వేలం వేయించాలన్నారు. జిల్లా ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి బుధవారం నిర్వహించిన నెలవారీ నేరసమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రజలతో సామరస్యంగా సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలన్నారు. ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమరవాణ నేరస్తులపై ఉక్కుపాదం మోపిందన్నారు. పిడి యాక్ట్‌లు ప్రయోగించనున్నట్లు తెలిపారు. పెండింగ్ కేసులపై ప్రత్యేకశ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.


నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

రెవెన్యూ సమస్యలపై స్పందించరా..?

అధికారులకు ఎమ్మెల్యే ఆగ్రహం..

ప్రజాశక్తి- యాదమరి: రెవెన్యూ సమస్యలపై సకాలంలో స్పందించరా అంటూ పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు తహశీల్దార్ హనుమంతుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అతిగారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కసిరాల గ్రామం పెరుమాలపెంట ఏఏడబ్ల్యూ గ్రామస్తుల ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌కు దారి సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వారి గ్రామానికి వెళ్లి వెంటనే సమస్య పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కానీ తహశీల్దార్ పదిరోజుల తరువాత గ్రామానికి వెళ్తానని చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్రామానికి వెళ్లి సమస్య పరిష్కరించి తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే తహశీల్దార్‌ను ఆదేశించారు. మండలపరిధిలో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయని ప్రతి గడపలోనూ భూసమస్యలు అధికంగా ఉన్నాయని మీరేం చేస్తున్నారని రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. అత్తిగారిపల్లి, బొమ్మనుచేను పాతపాలెం గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బి.ధనుంజయ రెడ్డి, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు సురేష్ బాబు, ఉహరి నారాయణ రెడ్డి, రవీంద్ర, మనోహర్, మనోహర్ రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, ఎస్సై సుమన్, హౌసింగ్ ఏఈ బాపిరాజు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ నవీన్, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీవో బాల పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయ గుత్తహక్కుల వేలం

రూ.5.85 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- నగరి: దేశమ్మ దేవాలయానికి గుత్తహక్కుల వేలం ద్వారా రూ.5.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వేణుబాబు అన్నారు. బుధవారం ఆలయం ఆవరనలో గుత్తహక్కులకు సీల్డ్ టెండర్ వేలం పాట నిర్వహించారు. అమ్మవారి కీచైన్లు, దారాలు, ఫోటోలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష, భక్తులు సమర్పించు చీరలు, జాకెట్లు పోగుచేసుకునే హక్కుకు రూ.1.10లక్షలు, సజీవ కోళ్లు పోగుచేసుకునే హక్కుకు రూ.లక్ష, వాహన రుసుము, వసూలు చేసుకునే హక్కుకు రూ.1.60లక్షలు, దుకాణంలో కూల్‌డ్రింక్స్, టీ, కాఫీ, బజ్జీ, బోండా అమ్ముకునే హక్కుకు రూ.1.15లక్షలు చొప్పున వేలంపాటలో కేటాయించారు. దీంతో ఆలయానికి రూ.5.85లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది రూ.4.56లక్షలు ఉన్న ఈ గుత్త హక్కుల ఆదాయం ఈ ఏడాది రూ.1.29 లక్షలు పెరిగిందని ఛైర్మన్ తెలిపారు. తలనీలాలు పాడుకొను హక్కుకు రెండుసార్లు వేలంపాట నిర్వహించినా ఎవరూ రానందున వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, టెంపుల్స్ ఇన్స్‌పెక్టర్ సుమనప్రియ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంను

తిరుపతి జిల్లాలో చేర్చాలి..: టిడిపి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: డిప్యూటీ సీఎం నారాయణస్వామి బాధ్యతతీసుకుని వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాల్లో చేర్చాలని, రాబోయే భవిష్యత్ తరాల వారికి మంచి చేయాలని మాజీ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి తెలిపారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి కార్యకర్తలు మోహన్ మురళీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం తిరుపతి జిల్లాకు కేవలం 25 కిలోమీటర్లు దూరంలోనే ఉందని, అన్నింటికీ సౌకర్యంగా తిరుపతి ఉందని కానీ ఎందుకు జిల్లాలో కలపడం లేదని ప్రశ్నించారు. ప్రజల సౌకర్యార్థం అటు వడమాల పేట, పుత్తూరును ఇటు పులిచెర్ల, రొంపిచర్ల మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చారని అయితే పక్కనే ఉన్న వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చకుండా ఉంటే ఈ నిరసనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌నాథ్‌రెడ్డి, నరసింహా యాదవ్, కిషన్, చందు, చంద్రబాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, వరప్రసాద్, రాజారెడ్డి, చిట్టెమ్మ, నాగరాజురెడ్డి, ఢిల్లీ ప్రసాద్, మధు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన 'హర్షతేజ'



హర్షితేజ అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- యాదమరి: జిల్లాస్థాయి వ్రేజలింగ్ పోటీలో కె.గొల్లపల్లె జెడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి హర్షతేజను గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ ప్రధానోపాధ్యాయులు లలిత, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, కనకాచారి, మధన్‌మోహన్, నరసింహారెడ్డి, విజయకుమార్, మధుసూదన్, మహేష్, దామోదర్‌రెడ్డి, అరుణ విద్యార్థి హర్షతేజను అభినందించారు. కనకాచారి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ముందజలో ఉంటూ పాఠశాలకు మంచిపేరు గుర్తింపు తెస్తున్నారని అన్నారు.

విద్యాసామర్థ్యాలపై అవగాహన పెంచుకోవాలి

ఎంఈఓ నాగేశ్వరరావు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యాసామర్థ్యాలపై అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సముదాయ సమావేశాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యా సంబంధిత విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో ఉపాధ్యాయులు అందరూ విద్యాసామర్థ్యాలపై అవగాహన పెంచుకుని పాఠశాలలో విద్యార్థులకు సులభతరంగా విద్యను బోధించాలన్నారు. సాంకేతికత విద్య పిల్లలకు ఎంతో అవసరమని ప్రస్తుత సమాజం సరిపోయే విద్యను నేర్చుకుని గ్రామీణప్రాంత విద్యార్థులకు సాంకేతికత విద్య నేరి వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు తోడ్పాటును అందించాలన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి ఎఎల్‌ఎస్ కోఆర్డినేటర్ విజయకుమార్ సందర్శించి ఉపాధ్యాయులకు ఈసమావేశాల్లో చర్చించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

బోధకాలు నివారణపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోధకాలు నివారణపై హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్ర ఏఎన్ఎంలకు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు. బోధకాలు నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన చర్యలు గురించి వివరించారు. అలాగే గర్భిణుల నమోదు, హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలను, బాలింతలు, నవజాత శిశువులకు అందించాల్సిన సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ అనురాధ, గోపి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

ప్రజాశక్తి- సోమల: సోమల పంచాయతీ చిన్న సోమల గ్రామానికి చెందిన రాజన్నకు చెందిన పాడి ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. రాజన్నకు చెందిన పాడి ఆవు గతంలో నాలుగు ఈతలు ఈని ఒక్కో దూడకు జన్మనిచ్చింది. అయితే బుధవారం ఉదయం రెండు పేయి దూడలకు జన్మనివ్వడంతో యజమాని ఎంతో సంబరపడిపోయాడు. రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు విషయంగా పశుసహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడుకు ఫోన్‌ద్వారా అడగగా జన్యుపర లోపం వల్ల ఒక్కోసారి రెండు దూడలు పుట్టే అవకాశం ఉందని అన్నారు. ఆవు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని వైద్యాధికారిని చందన ప్రియ, సిబ్బంది సుధాకర్ తెలిపారు.

దస్తావేజులను ఆన్‌లైన్ చెయ్యకండి



నగరిలో...


ప్రజాశక్తి- నగరి: ఆస్తుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన దస్తావేజుల ప్రాంతంలో డిజిటల్ దస్తావేజులను తీసుకురావద్దంటూ దస్తావేజు లేఖరులు, విక్రయదారులు, దస్తావేజులపై కంప్యూటర్ ప్రింట్‌లు తీసే ఆపరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన వారు సబ్‌రిజిస్ట్రారు సుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. డిజిటలైజ్ చేయడం వల్ల పొరపాట్లు తలెత్తే అవకాశం ఉందని, పలువురు ఉపాధి కోల్పోతారని ప్రస్తుతం ఉండే పద్దతులనే కొనసాగించాలని కోరారు.

పలమనేరు: పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట బుధవారం డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు పెన్‌డౌన్ చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న సాఫ్ట్వేర్ కారణంగా డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోవడంతో పాటు రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని వాపోయారు. నూతన విధానాన్ని పక్కనపెట్టి పాతపద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్లు లక్ష్మీపతి, చంద్రబాబు, కోటి మహమ్మద్ బాష పాల్గొన్నారు.



పలమనేరులో...

బంగారుపాళ్యం: భూముల రిజిస్ట్రేషన్‌ను సచివాలయాలకు బదిలీ చేయడం ఆపాలని మండల దస్తావేజు లేఖరు అధ్యక్షులు నాగరాజ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రెండు రోజుల నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సాయిబాబా, సలహాదారు పద్మనాభపిలై, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరలాల్, కార్యదర్శి సురేష్, కోశాధికారి సుజాత, తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో..

పుంగనూరు: పుంగనూరు దస్తావేజులేఖరుల సంఘం వారు రెండు రోజుల పాటూ పెన్‌డౌన్ ద్వారా నిరసన కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరు సబ్‌రిజిస్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న కార్డు ప్రైమ్ 2.0. విధానానికి వ్యతిరేకిస్తూ పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్నట్లు నాయకులు తెలిపారు.

ఓటరు జాబితాను ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలి: డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు: ఓటరు జాబితాలో 2022 జనవరి నుండి ఇప్పటివరకు తొలగించిన ఓటర్ల రీవెరిఫికేషన్‌ను బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లో 2022 జనవరి నుండి ఇప్పటి వరకు తొలగించిన ఓటర్లను ప్రక్రియను డిఆర్ఓ రీ వెరిఫికేషన్ చేశారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2022 జనవరి నుండి ఇప్పటి వరకు తొలగించిన ఓటర్లను రీవెరిఫికేషన్ బిఎల్ఓలు మరోమారు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని అన్నారు. ఓటరు జాబితా తయారీలో బిఎల్వోలు బాధ్యతతో విధులను నిర్వర్తించాలని పారదర్శకంగా ఓటరు జాబితా తయారీకి కషిచేయాలని తెలిపారు. బిఎల్ఓలతో ఈఆర్ఓలు, స్పెషల్ ఆఫీసర్స్‌తో పాటు ఏఈఆర్ఓలు కూడా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. డిఆర్ఓ వెంట డిప్యూటీ తహశీల్దార్ కిరణ్, పాల్గొన్నారు.



ఓటర్ వెరిఫికేషన్ దరఖాస్తుల పరిశీలిస్తున్న డిఆర్ఓ రాజశేఖర్

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు

స్కానింగ్ సెంటర్లపై వైద్యఆరోగ్యశాఖ అధికారుల దాడులు



స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతిదేవి ఆదేశాల మేరకు పిసిపి ఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు చిత్తూరు నగర పరిధిలోని వివిధ స్కానింగ్ సెంటర్‌లను రెండవరోజు ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ గర్భస్త లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరమని, స్కానింగ్ చేసి ఎట్టిపరిస్థితిల్లోనూ గర్భిణులకు తెలియజేయకూడదని అలా తెలిపితే రూ.10 జరిమానాతో పాటు 1994 ప్రకారం చట్ట రిత్యానేరమని 3 సంవత్సరాల జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు. అలాగే నగరంలోని మధు స్కాన్, విద్య హాస్పిటల్, లైఫ్‌లైన్ స్కాన్ సెంటర్లతో పాటు వివిధ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. పుట్టబోయే బిడ్డకు జన్యుపరమైన లోపాలు, అంగవైకల్యం, శారీరక లోపాలున్నట్లు తెలిస్తే ప్రభుత్వ డాక్టర్లే తగిన జాగ్రత్తలు తీసుకుంటారని, అలాగే ప్రైవేట్ ఆసుపత్రి వారు లేబరేటరీ రక్తపరీక్షలు చేసేవారు తప్పనిసరిగా జిల్లా వైద్యఆరోగ్యశాఖలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అలా చేసుకోని వారిపై కఠినశిక్షలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, ఆరోగ్య వైద్యాధికారి, డాక్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత: ఎంపిపి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని ఎంపీపీ సరిత తెలిపారు. మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభసమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారులను గుర్తించాలని అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణానికి అదనంగా రూ.18వేలు ప్రభుత్వం అందిస్తోందని, రైతులు పండించిన పంటను ఈక్రబ్ నమోదు చేసుకోవాలని, ఒక ఎకరాకి గరిష్టంగా రూ.5వేలు పంట బీమా అందించడం జరుగుతుందని ప్రతి రైతు సాగు చేసిన పంటను నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయ నిర్మాణానికి రూ.3,50,000లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. మండలంలో ఉన్న రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వచ్చే నెల సెప్టెంబర్ నుంచి 24 గంటలు అందుబాటులో ఉంటాయని అక్కడే కిడ్నీ, లివర్ కొలెస్ట్రాల్ జాండీస్, షుగర్, బిపి మొదలగు టెస్టులు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 2003 సంవత్సరం ముందు ప్రభుత్వ డీకేటి భూములను అమ్ముకునేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అధికారులు అలాంటి రైతులు గుర్తించి సమగ్రంగా సర్వే నిర్వహించాలని అన్నారు. జడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో కష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిళ్లై, డిసిసి బ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, పురుషోత్తం, కోఆప్షన్ నెంబర్ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

సమస్యలు పరిష్కారం కాకుంటే మండలమీట్ ఎందుకు..?

పలువురు సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: సమస్యలు పరిష్కారం కాకపోతే మండల సర్వసభ్య సమావేశానికి ఎందుకు రావాలని పలువురు సర్పంచులు ధ్వజమెత్తారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పెద్దకాల సర్పంచ్ ఏకాంబరం మాట్లాడుతూ జగనన్న లేఔట్స్ కోసం గుట్టను యంత్రాలతో చదును చేయమని తనను ప్రోత్సహించి పనులు పూర్తయ్యాక వాటి బిల్లులు చెల్లించకపోతే ఎలాఅని డీఈ వెంకటేశ్వర్లను ప్రశ్నించారు. వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ వారంలో ఆరు రోజులు గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తోందని, ఆదివారం మాత్రం రావడం లేదని, దీనివల్ల తమ గ్రామంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ బిందుమాలతి మాట్లాడుతూ అన్నిరకాల సౌకర్యాలతో అంగన్వాడీ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, సర్పంచులు ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లోని చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడానికి వారివారి వంతు సహకారం అందించాలని కోరారు. పాతపాళ్యం సర్పంచ్ క్రిష్ణమనాయుడు మాట్లాడుతూ పంచాయతీలోని వేణుగోపాలపురం వద్ద సర్వే నెంబర్ 10లో దారికి సంబంధించిన భూమిని ఆక్రమించుకున్నారని వాటి విషయంగా తొలగించాలని తహశీల్దార్‌ను కోరామని, రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఆక్రమణకు గురైన దారిసమస్య పరస్కరించలేదని వాపోయారు. తహశీల్దార్ ఇన్బనాధన్ మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలంలో భూపంపిణీ కింద రైతులను 235 మందిని గుర్తించామని వారికి 255ఎకరాలు భూపంపిణీలో అందించనున్నట్లు చెప్పారు. ఇంకా భూములను దున్నుతూ అనుభవిస్తున్న వారు భూపంపిణీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు మాట్లాడుతూ పాడి ఆవులకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే 1962 టోల్‌ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాసమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపిన వాటిపై సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లామని, ఆ అధికారులు నుండి సరైన సమాధానం రాలేదన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, ఎంఈఓ కాణిపాకం ఆంజనేయులు శెట్టి, తూగుండ్రం పిహెచ్‌సి డాక్టర్ ప్రశాంత్, ఉపాధిహామీ ఎపిఓ శ్రీనివాసులు హౌసింగ్, విద్యుత్‌శాఖ ఏఈలు రాజా, వెంకటరమణ, ఐకెపి ఎపిఎం చిరంజీవి, మండల వ్యవసాయ అధికారిణి వందన, ఇంచార్జ్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సునీల్, సూపర్వైజర్ సంగీత, ఈవోపీఆర్డి శివయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత




కుప్పంలో వైసిపి విభేదాలు

ప్రజాశక్తి- కుప్పం: జల్లికట్టు జరపడంలో మొదలైన తగాదా తారాస్థాయికి చేరిన విభేదాలు ఏకంగా జల్లికట్టు నిలిపివేయాలని వైసిపి సర్పంచ్‌తో సహా ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఇదిలా ఉండగా జల్లికట్టు జరిపడానికి ఏకంగా సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్ ఫోటోలతో కూడిన కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశారు. కుప్పం మండల పరిధిలోని వానగుట్టపల్లి గ్రామంలో సెప్టెంబర్ 3న జల్లికట్టు ఏర్పాటు చేసినట్టు కొన్ని కరపత్రాల రూపంలో తెలిసింది. అయితే అదే గ్రామానికి చెందిన సర్పంచ్ రామచంద్ర జల్లికట్టు జరపడాన్ని విభేదిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేయడం కుప్పంలో హాట్ టాఫిక్‌గా మారింది. జల్లికట్టు జరిపితే గ్రామంలో గొడవలు జరిగే ఆస్కారం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

ఎంపీడీవోగా తాజ్ మస్రూర్

ప్రజాశక్తి- గుడిపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బుధవారం తాజ్‌మస్రూర్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివద్ధి కార్యక్రమానికి బాటలు వేస్తానని పేర్కొన్నారు. వీరు గతంలో గంగవరం ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై గుడుపల్లె ఎంపీడీవోగా వచ్చారు. మండల ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసుకుంటే వెంటనే పరిష్కారమార్గాలు చూపుతానని తెలిపారు.





రాయితీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా మండలానికి సంబంధించి రైతులకు 80శాతం సబ్సిడీతో మంజూరైన 130 క్వింటాళ్ల విత్తన ఉలవల పంపిణీని బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.వెంకటే గౌడ రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు మండలానికి 130క్వింటాళ్ల ఉలవలు అందుబాటులో ఉన్నాయని రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో నిర్దేశించిన తేదీలలో విత్తనాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ అన్నపూర్ణాదేవి, ఏఓ సంధ్య, ఆత్మ చైర్మన్ గోవిందరెడ్డి, వైసిపి నాయకులు రంగానాథం, చెంగారెడ్డి, గోవిందస్వామి, విజయకుమార్, కరిడిమడుగు సర్పంచ్ బాలాజీ నాయుడు, రమేష్ బాబు, అనిల్ కుమార్, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో ..

గుడిపల్లి: మండలం కనమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ భాస్కర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఉలవలను బుధవారం ఉలువలు పంపిణీ చేశారు. 20 కేజీల ఉలువల బ్యాగును 80శాతం ప్రభుత్వ రాయితీ పోను రూ.216లకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉలవలు కావల్సిన రైతులు సచివాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.



ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామం బస్టాండు కూడలి, సోమల - కలికిరి మార్గంలో ఆక్రమణల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ఇదివరకే ఆక్రమణలు తొలగించినా మళ్లీ కొందరు రోడ్డును ఆక్రమించుకొని ఇబ్బంది కలిగిస్తున్నారని బుధవారం పంచాయతీ సిబ్బంది, ఆర్ అండ్‌బి అధికారులు, పోలీసు సిబ్బంది ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి జయశంకర్ మాట్లాడుతూ సోమల కలికిరి మార్గంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తై ప్రస్తుతం తారు రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఈ క్రమంలో కందూరులోని ప్రధాన రహదారిలో రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి మురుగునీటి కాలువలు నిర్మించడం జరిగిందన్నారు. అయితే మళ్లీ కొందరు ఆక్రమణలను చేస్తూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఇందుకోసం వారందరికీ ఆక్రమణలు తొలగించాలని తెలియజేస్తూ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. గురువారం లోపు ఆక్రమణలు స్వచ్చందంగా తొలగించుకోకపోతే పంచాయతీ పరమైనచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్ అండ్‌బి, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మానాయుని పల్లెలో

వైఎస్సార్ కంటి వెలుగు

ప్రజాశక్తి -సోమల: సదుం మండలం తిమ్మానాయునిపల్లె సచివాలయంలో డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 67 మందికి కంటి అద్దాలను ఎంపీపీ ఎల్లప్ప, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. వైద్యాధికారిని గిరీషరెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి సంబంధ సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటిఅద్దాలు అందించడం జరుగుతుందని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరిప్రియ, ఆరోగ్య కార్యకర్త విమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్యాంలో దిగి బాలుడు మృతి



ప్రజాశక్తి- కుప్పం: మండలంలోని పెద్దవంక గ్రామపరిధిలోని పాలారు చెక్‌డ్యామ్ లోకి దిగి తమిళనాడు వానియంబడి ప్రాంతానికి చెందిన ధనుష్ (16) ప్రాణాలు పోగొట్టుకోవడం స్థానికంగా కలవరం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామపరిధిలో వెలిసిన కనక నాచనమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి ఆంధ్ర తమిళనాడు ప్రాంతాల నుంచి విరివిగా భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో తరచూ చెక్‌డ్యామ్ వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, ఈ ప్రమాదాలలో ప్రాణాలు పోగొట్టుకోవడం తరచూ చూస్తున్నామన్నారు. ఈక్రమంలోనే బుధవారం నాడు ప్రమాదవశాత్తు ధనుష్ చెక్‌డ్యామ్‌లో మునిగి మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని శవాన్ని వెలికి తీసినట్టు అగ్నిమాపక కేంద్ర అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, హ్యాండ్ వాష్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యసిబ్బంది బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు విజయలక్ష్మి, నీలిమ 370 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలను వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం చేతుల పరిశుభ్రత ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈవో కుమార్, వెంకటేశ్వర్లు, ప్రమీలమ్మ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఆర్‌సి శిక్షణా కార్యక్రమం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో 30, 31వ తేదీలలో సిఆర్‌సి శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన సిఆర్‌సి ప్రధానోపాధ్యాయులు, జాయింట్ సెక్రటరీల సమావేశం బుధవారం జరిగింది. ప్రాథమికస్థాయిలో మండిపేట కోటూర్, పెంగరగుంట, దొడ్డిపల్లె సిఆర్‌సిలో 50శాతం ఉపాధ్యాయులు, పెంగరగుంట హైస్కూల్‌లో, కొలమాసనపల్లె, గర్ల్స్ పలమనేరు, గవర్నమెంట్ పలమనేరు 50శాతం ఉపాధ్యాయులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని మండల విద్యా శాఖాధికారి లీలారాణి తెలిపారు. అదేవిధంగా సబ్జెక్టు శిక్షణాతరగతులు రెండు రోజులు గర్ల్స్ పాఠశాల, వ్యాయమ ఉపాధ్యాయులుకు, ప్రైమరీ, సబ్జెక్టు, ఉర్దూ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించండం జరుగుతుందని తెలిపారు.

రక్తహీనత లోపంపై అవగాహన



ప్రజాశక్తి- పులిచెర్ల: బాలికల్లో రక్తహీనత లోపించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారిని జానకిరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనత లోపంపై అవగాహన కల్పించారు. అనంతరం 395మంది బాలికలకు ఐరన్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జానకిరావు మాట్లాడుతూ కౌమార దశలో రక్తహీనత సమస్య తలెత్తకుండా ఉండేందుకు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవడం వలన రక్తహీనత లోపం లేకుండా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

చేతి వృత్తులపై శిక్షణా తరగతులు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధి పథకంలో 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలకు చేతివృత్తులపై శిక్షణా తరగతులు ఏర్పాటు చేయనున్నట్టు డిఆర్‌డిఏ జాబ్‌కోఆర్డినేటర్ కవిత తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు మెట్లతో చేతివృత్తులపై అవగాహన కార్యక్రమం ఏపీవో కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో 100రోజులు పూర్తి చేసుకున్న వారి కోసం వారిలో దాగి ఉన్న చేతివృత్తులపై శిక్షణా తరగతులు ఏర్పాటుచేసి వారిని చేతివృత్తులతో జీవనం కొనసాగేవిధంగా తయారు చేయాలని ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకం గురించి గ్రామీణప్రాంతంలో ఉపాధి కూలీలకు తెలియజేయాలన్నారు. ఏపీడీఓ సునీల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కొత్రేపల్లి క్రాస్ నుంచి మునిపల్లె జాతీయ రహదారిలోని ఏం.కొత్తూరు గ్రామసమీపాన ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు కొత్రేపల్లి గ్రామానికి చెందిన మునస్వామి (55)కు బలమైన గాయాలు అయ్యాయి. గ్రామస్తులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో మెరుగైన చికిత్స కోసం కుప్పం పిఈఎస్‌కి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.